నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 30 జనవరి 2023



మృతుడి కుటుంబానికి పరామర్శించిన బీఎస్పీ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మండల ఉప్పల గూడెం గ్రామానికి చెందిన తెడ్డు యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం గజ్వేల్ నియోజకవర్గ బీఎస్పీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్, జిల్లా కార్యదర్శి కొండనోళ్ళ నరేష్, నియోజకవర్గ అధ్యక్షులు గూడూరి కరుణాకర్, ఉపాధ్యక్షులు గుర్రం ఎల్లం, మండల అధ్యక్షులు, నవీన్, వంశీ, నితిన్, ప్రశాంత్, అనిల్ తదితరులున్నారు.

అలయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



నవ తెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ టాలెంట్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల అందజేశామని అలయన్స్ క్లబ్స్ తెలంగాణ కోఆర్డినేటర్ ఆత్మా రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం ఇలాంటి క్విజ్ ప్రోగ్రాంలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ రాజమల్లెయ్య గౌడ్, ఫాస్ట్ గవర్నర్ కూర అంతయ్య, వైస్ గవర్నర్ సోమ వనజ, జిల్లా కార్యదర్శి శేఖరం, జోన్ చైర్మన్ వెంకటలక్ష్మి, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్ది మల్లేశం, వెంకటరమణారెడ్డి, గరిపల్లి భవాని, సూర్యం, దారం బాలశేకరము, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంటలను సర్వే చేయండి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్





నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

స్టేన్ బోరర్ వరి(మొగి) పురుగు వలన దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి వివరాలను ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నారాయణరావుపేట మండల కేంద్రంలోని వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు నోబీ పురుగు సోకడం వలన వరి పైరు ఎదగకుండా ఎర్రబారి పోతోందని వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పంట నష్టపోతున్నందున ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరారు. వ్యవసాయ అధికారులతో పంట నష్టం వివరాలను సేకరించి మంత్రి హరీశ్‌రావుకు నివేదిక సమర్పిస్తామన్నారు. ప్రకృతి, ఇతర కారణాల వలన పంటలకు తెగులు సోకుతాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం రైతులకు అండగా ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రసాయనిక, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు అవసరమైన మందులను రైతులకు సూచించాలని, పంటలకు తెగలు సోకకుండా పంట వేసేటప్పుడు ముందస్తుగా వ్యవసాయదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలని అన్నారు. రైతు వేదికలో పంటలు సాగు చేసే విధానం, క్రమపద్ధతిలో మందుల వివరాలతో ఫ్లెక్సీలు పెట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ సంతోష్ కుమార్, సర్పంచ్ శశి యాదగిరి,, ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు స్వప్న ప్రభాకర్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, ఏఈఓ నాగర్జున, రైతులు తదితరులు పాల్గొన్నారు

అధికారుల సూచనలు పాటిస్తేనే రైతులకు మేలు

నవతెలంగాణ-బెజ్జంకి

రైతులు పంటలు సాగు చేయడానికి సమాయత్తమవుతున్న సమయంలో వ్యవసాయ శాఖాధికారుల సూచనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ రైతులకు సూచించారు. మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు ఆదివారం మండల కేంద్రంలో తెగులుసోకి కొలుకున్న వరిపంట పొలాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వరి వంగాడాలు నాటే సమయంలో తీసుకున్న సస్యరక్షణ చర్యలు, జాగ్రత్తలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాటే ప్రక్రియలో రైతులు తీసుకున్న అజాగ్రత్తలు, వాతావరణ మార్పుల పరిస్థితి దృష్ట్యా వరిపంటలో తెగుళ్ల ఆశిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని, అధికార యంత్రాంగం సహాయ సహకారాలందించడానికి సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి రైతులను సమన్వయం చేసుకుంటూ వరిపంటకు సోకిన తెగుళ్లపై నివేదిక రూపొందించాలని, ఆ నివేదికను మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఎంపీపీ నిర్మల, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ రాజయ్య, లక్ష్మారెడ్డి, దీటీ రాజు, మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, జిల్లా వ్యవసాయాధికారి శివ ప్రసాద్, ఏడీఏ మహేష్, శాస్త్రవేత్త విజయ్, ఏఈఓలు రేణుకాశ్రీ, మానస, రచన, ఆత్మాధికారి సాయి చరణ్, రైతులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని విజ్ఞప్తి

ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులు సాగుచేస్తున్న వరి పంటలకు తెగుళ్ల సోకి 50 శాతం నశించిపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరిపంటకు సోకిన తెగులుతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని, ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలో పేర్కొంటామని పాటీల్ తెలిపారు.

కలెక్టర్ ఏఓ గైర్హాజర్

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వరిపంట పొలాల పరిశీలన పర్యటనలో మండల ఏఓ గైర్హాజరవ్వడం చర్చనీయాంశంగా మారింది. వరిపంట పొలాలకు సోకిన తెగుళ్లపై ప్రాథమిక స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక రూపొందించాలని కలెక్టర్ సూచించిన సమయంలో ఏఓ గైర్హాజరీలో ఉండడం శోచనీయం.

వాల్‌పోస్టర్ విడుదల





నవ తెలంగాణ-దౌల్తాబాద్

గజ్వేల్ పట్టణంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా రెడ్డి జాగృతి సంఘం అధ్యక్షుడు దేవుడి నర్సింహారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్, గోవిందాపూర్, గువ్వలేగి, గాజులపల్లి, కోనాపూర్, గొడుగుపల్లి, శౌరిపూర్ గ్రామాలలో వాల్‌పోస్టర్లను విడుదల చేసి అనంతరం ఆయన స్థానిక విలేకరులతో ాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు 2018లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద కుటుంబాలను ఆదుకుంటా అన్నమాట నీటి మూటలుగా మిగిలిపోయాయని మండిపడ్డారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో రెడ్డిలకు బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. రెడ్డి జాగృతి మండల అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి వైసీపీ అల్లి శేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి నరసింహారెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,అనంతరెడ్డి సంజీవరెడ్డి ,నారెడ్డి కర్ణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-చేర్యాల

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎస్.కె.ఆరిఫా తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. మండల పరిధిలోని కడవేరుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ.అఫ్రోజ్ తెలిపారు.

ఆర్మీకి ఎంపికైన 14 మంది అథ్లెటిక్స్ క్రీడాకారులు

నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తీసుకున్న 14 మంది క్రీడాకారులు ఆర్మీ (అగ్నిపథ్)కి ఎంపికయ్యారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్ తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన కృష్ణ కుమార్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, జిల్లా క్రీడా అధికారి నాగేందర్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు బండారుపల్లి శ్రీనివాసులు, కామిరెడ్డి రవీందర్ రెడ్డి, ఎర్ర అశోక్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం సభ్యులు చంద్రశేఖర్, కనక రెడ్డి, రంగనాథ్, ప్రేమ్ నారాయణ, ప్రభాకర్, నిశాంక్ గౌడ్, మహేష్ తదితరులు వారిని అభినందించారు.

బైక్ అదుపుతప్పి ఆర్టీసీ కండక్టర్ మృతి



నవతెలంగాణ -హవేలిఘనపూర్

బైక్ అదుపుతప్పి ఆర్టీసీ కండక్టర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ముత్తాయి కోట సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మెదక్ పట్టణానికి చెందిన శ్రీనివాస్(47) సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఉద్యోగం చేస్తున్నారు. బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పాడు. హవేలీఘనపూర్ మండలం ముత్తాయికోట సమీపంలోకి రాగానే అతని బైక్ అదుపుతప్పి కింద పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందారు. ఎస్ఐ శేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవ తెలంగాణ-ములుగు

డ్రైవర్ అతివేగం అజాగ్రత్త వల్ల డివైడర్ రెడ్డి కొన్న కారు పల్టీలు కొట్టడంతో ఒకరు మృతి చెందగా నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సై రంగా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూరు గ్రామానికి చెందిన ఎండీ మోజొద్దీన్(22) ఎల్ఈడి ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఆర్డర్ తీసుకోవడానికి కరీంనగర్ వెళ్లాడు. ఆదివారం కరీంనగర్ నుంచి కారులో హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో ఉదయం 7.30 గంటల సమయంలో ములుగు మండలం వంటిమామిడి గ్రామం దాటిన తరువాత రాజీవ్ రహదారి పక్కన గల చెట్లకు ఢీకొట్టింది. దీంతో కారు బోల్తా పడడంతో మోజొద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీధర్ అజాగ్రత్తతో ఈ ప్రమాదం సంభవించిందని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అరులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన సీఐటీయూ జిల్లాస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అర్హులైన వారికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదన్నారు. నేటికీ లక్షల సంఖ్యలో పేదలకు ఇండ్లు లేక పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఇండ్ల కోసం లక్షల సంఖ్యలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం వాటిని పరిగణలోకి తీసుకొని పరిష్కార మార్గాలు చూపడం లేదన్నారు. ఇండ్లు లేని నిరుపేదల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. ప్రభుత్వ తీసుకొచ్చిన పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి స్థలం ఉన్న వారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించాలన్నారు. స్థలం లేని వారికి స్థలం కేటాయించి, అందులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి కళావతి, బండ్ల స్వామి, ఎం పద్మ, కాట మధు జిల్లా కోశాధికారి జి భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, తునికి మహేష్, ఇప్పకాయల శోభ జిల్లా కమిటీ సభ్యులు వేణుగోపాల్, రంగారెడ్డి, గుంటిపల్లిసధాకర్, మండల భాస్కర్, ఆరుట్ల రవి, కే భాస్కర్, రాపాక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముందున్న ప్రభుత్వం : ఎంపీ





నవ తెలంగాణ-మిరుదొడ్డి

పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. ఆదివారం అక్బర్‌పేట భూంపల్లి మండలం కాజీపూర్ గ్రామంలో కోణార్క్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కోణార్క్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వివిధ ప్రవేట్ ఆస్పత్రి వారు గ్రామంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రైవేట్ ఆసుపత్రిలో ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తే తన వంతుగా సహకరిస్తానని ఎంపీ వెల్లడించారు. వైద్య శిబిరంలో ఉచితంగా రోగులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎవరికైనా ఆపరేషన్లు అవసరం ఉంటే ఉచితంగా చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోణార్క్ ఆసుపత్రి వైద్యులు రజిని అశోక్, డిసిసిబి డైరెక్టర్ వెంకటయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, సర్పంచ్ మమత, పిఎసిఎస్ చైర్మన్ కైలాస్, ఏఎంసి చైర్మన్ జ్యోతి కృష్ణ, సర్పంచ్ శ్రీనివాస్, వెంకటరెడ్డి, అనసూయ ప్రతాప్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రవి, సురేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మేకల కనకయ్యకు ఘన సన్మానం



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలంలోని చేబర్తి గ్రామ ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సేవా రత్న అవార్డు గ్రహీత బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్‌ను ఆదివారం శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చేబర్తి ఉపసర్పంచ్ గుర్రాల అశోక్ మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మేకల కనకయ్యకు సేవారత్న అవార్డు అందుకున్న సందర్భంగా చేబర్తి గ్రామ ముదిరాజ్ నాయకుల ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశామన్నారు. మేకల కనకయ్య ముదిరాజ్ సేవకు ప్రతిరూపంగా నిలుస్తూ.. నిరుపేదలకు అండగా ఉంటూ పేదింటి ఆడపిల్లల పెళ్లికి పుస్తెమట్టెలు అందజేస్తూ, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేస్తూ.. రాజకీయంలో రాణిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న మేకల కనకయ్య మా ముదిరాజ్ సమాజానికి గర్వకారణమనాప్హరు. భవిష్యత్తులో రాజకీయంగా ఆర్థికంగా ఆయన మరింత ఎదగాలన్నారు. చేబర్తి ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షులు తోట సాయిలు, పోయిల మల్లేశం, దేశమైన నర్సింలు తదితరులున్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



నవతెలంగాణ-చిన్నకోడూరు

దేశ భవిష్యత్తు కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు తరలి వచ్చిన అన్ని వర్గాల ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు యూత్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ యాత్రిక్ అజ్జు యాదవ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తండోపతండాలుగా జనం తరలివచ్చి రాహుల్ గాంధీకి స్వాగతం పలికారని, ఇక్కడి ప్రజల ప్రేమానురాగాలకు రాహుల్ మంత్రముగ్ధులయ్యారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని తెరాస ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, ఆ రెండు ప్రభుత్వాలకు కాలం చెల్లిందన్నారు. రాహుల్ జోడో యాత్రతో బీజేపీ, తెరాస పార్టీల్లో వణుకు మొదలైందన్నారు. జోడో యాత్రను అద్భుతంగా సక్సెస్ చేసిన అందరికీ మరోసారి అజ్జు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. యాత్ర సక్సెస్ కావడానికి సహకరించిన రాష్ట్ర ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, పోలీస్ మరియు వైద్య అధికారులకు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేయాలి

సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అందె అశోక్



నవతెలంగాణ-చేర్యాల

అర్హులైన పేదలకు వెంటనే రేషన్ కార్డులు పంపిణీ చేయాలని సీపీఐ జనగామ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అందె అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో ఆదివారం రేషన్ కార్డులు లేని పలువురు పేదలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు లు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా మంజూరుకు నోచుకోకపోవడం అధికారులు, పాలకుల అసమర్థత పాలనకు నిదర్శనమని అన్నారు. వివాహం చేసుకున్న వారు, జన్మించిన కుటుంబ సభ్యులను కూడా కార్డులో చేర్చుకునే అవకాశం కల్పించకపోవడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం, సరుకులు, ఇతర సంక్షేమ పథకాలు అందకుండా దుర్భర జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ప్రభుత్వం ఆలోచించి రేషన్ కార్డులు లేని వారికి వెంటనే కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బూర సీతారామయ్య, సంగిశెట్టి వెంకట్, జిడ్డి లచ్చయ్య, జిడ్డి సారయ్య, జిడ్డి వెంకటేష్, కరుణాకర్, స్వరూప, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యువత- భవిత కవితా పోటీల్లో ముక్కపల్లి సాగర్ ఎంపిక



నవతెలంగాణ-దుబ్బాకరూరల్

ఈ నెల 23న హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో యువత -భవిత అనే అంశంపై యువకవులకు కవితా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సిద్దిపేట స్నాతకొత్తర తెలుగు ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆరుగురు యువకవులు పాల్గొన్నారు. వీరంతా ఒక సమూహంలోని 300 మంది కవులతో పోటీల్లో పాల్గొన్నారు. యువత-భవిత పోటీల్లో ఆ సమూహ యువ కవుల నుండి ఉత్తమమైన కవితలుగా 10 కవితలని ఎంపిక చేశారు. అందులో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలానికి చెందిన ముక్కపల్లి సాగర్ ఎంపికయ్యారు. ముక్కపల్లి సాగర్ స్వస్థలం పద్మనాభునిపల్లి పల్లి కాగా... యువ కవి సాగర్ ని శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆదివారం శాలువాతో అవార్డ్ అందజేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషకారమని అన్నారు. భవిషత్ లో మరిన్ని అవార్డులు అందుకోడానికి కృషి చేస్తానన్నారు. మరో వైపు యువ కవి సాగర్ ప్రతిభను మెచ్చి గ్రామస్తులు, తోటి స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







హరితహారం మొక్కలు అగ్ని ఆహుతి


నవతెలంగాణ-మర్కుక్

ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలు కొందరి నిర్లక్ష్యం మూలంగా అగ్నికి ఆహుతవుతున్నా పట్టించుకునే వారే లేరు. మండలంలోని దామరకుంట, అంగడికిష్టాపూర్, గణేష్‌పల్లి శివారులో రోడ్డు కిరువైపులా నాగేళ్ల కిందట నాటిన మొక్కలు ఇటీవల మంటల్లో కాలిపోయాయి. పిచ్చిమొక్కలతో పాటు మొక్కలు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. వందల మీటర్ల పొడవునా మొక్కలు దగ్ధమయ్యాయి. మొక్కలు కాలిపోయిన పది రోజులు దాటినా... ఈ విషయం అధికారులకు తెలిన ఇప్పటి వరకు నీళ్లు పోయ్యకపోవటం గమనార్హం.

నవతెలంగాణ

సంగారెడ్డి

సోమవారం 30 జనవరి 2023



జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



నవతెలంగాణ-కంగ్టి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని టీయుడబ్ల్యూజేహెచ్-143 ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన కంగ్టిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు పారదర్శకంగా వార్తలు రాసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎంతటి సమస్యలైనా వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, ఐలమ్మ, బసవేశ్వర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, తాలుకా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు సేవాగుణం పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



ప్రతి ఒక్కరూ భక్తి భావం, సేవాగుణం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మహం కాళి దేవాలయంలో నవ యువక్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరే రామ హరే కృష్ణ 24 గంటల అఖండ సంకీర్తన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 24 గంటల పాటు నిరంతరాయంగా అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, కిషన్ ప్రసాద్, సందీప్ షా, కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

న్యాల్కల్ మండల సమస్యలు మంత్రి దృష్టికి..



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో నెలకొన్న పలురకాల సమస్యలను ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి జెడ్పీటీసీ బి.స్వప్న భాస్కర్ తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి ఆదివారం కలిసి మండల సమస్యలను వివరించారు. మండలాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.



కల్యాణ లక్ష్మి చెక్కు అందజేత

నవతెలంగాణ-నారాయణఖేడ్

నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్దిదారులకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శరణప్ప, యువత నాయకులు మారుతి ఉన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

చాల్కి గ్రామానికి చెందిన బస్వరాజ్‌కు రూ.48,000, జి. దిలీప్‌లకు రూ.24,000 విలువ గల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. కాగా లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఈ చెక్కులను ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు చాల్కి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సందల్ ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో గల మహబూబ్ సుభాని దర్గాను ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో నిర్వహించిన సందల్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధికి సహకారాన్ని అందిస్తానన్నారు. ఈ సందర్భంగా దర్గా పెద్దలు చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి , ముస్లిం సోదరులు రియాజ్, అజాం, అల్తాఫ్, ఇమ్రాన్, షేర్, కాసిం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షపాతి నవతెలంగాణ



నవతెలంగాణ-నారాయణఖేడ్

నవతెలంగాణ దినపత్రికగా ఎల్లవేళలా ప్రజల పక్షపాతిగా పనిచేస్తున్నదని డాక్టర్ దేవరాజ్ అన్నారు. ఆదివారం నవతెలంగాణ- 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను వెలికితీయ డంలో నవతెలంగాణ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవికి ముందే కరెంట్ కోతలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

వేసవికాలం రాకముందే కరెంటు కోతలు మళ్లీ మొదలయ్యాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి దాపరించిందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నప్పటికీ.. మండల పరిధిలోని మామిడిగి, న్యాల్‌కల్, చాల్కి, మెటల్ కుంట, గంగ్వార్, ముంగి గ్రామాల్లో కరెంటు కోతలు తీవ్రంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎప్పుడు వస్తుందో తెలియని కరెంటుతో పంటకు నీరందట్లేదని.. దీంతో పంటలు దెబ్బతినే దుస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు రైతులను దృష్టిలో ఉంచుకుని.. కోతలు పెట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

పటాన్‌చెరు ఏరియా మేదరి మహేంద్ర వెదురు బొంగుల దుకాణదారుల సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-పటన్‌చెరు

పటాన్‌చెరు ఏరియా మేదరి మహేంద్ర వెదురు బొంగుల దుకాణ దారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పటాన్‌చెరులో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నంది కంటి నర్సింలు, అధ్యక్షుడిగా జొర్రిగల లోకేదాస్, కార్యదర్శిగా పాత కోటి బిక్షపతి, ఉపాధ్యక్షుడుగా పోతుల మల్లేష్, కోశాధికరిగా పోతుల శేఖర్ ఎన్నిక అయ్యారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు అంబాదస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుకాణ దారులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం, దుకాణ దారుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. దుకాణా దారుల అభివృద్ధి కోసం జిల్లా సంఘం సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేదరి మహేంద్ర సంఘం నాయకులు, వెదురు బొంగుల దుకాణ దారులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం





నవతెలంగాణ-పటాన్‌చెరు

క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నట్టు పటాన్‌చెరు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైత్రి మైదానంలో ఏడాది పొడవునా వివిధ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. మనిషి జీవితంలో చదువు, సంపాదనతో పాటు శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసం ఎంతో ప్రాముఖ్యమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచితే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రెండు రోజులపాటు జరగనున్న టోర్నమెంట్లో 32 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. పటాన్‌చెరు ఏఎంసీ చైర్మెన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ బీసన్న, జాతీయ వాలీబాల్ అంపైర్లు అమర్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, ముస్తఫా, నిర్వాహకులు యంజాల్ సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

శెట్టి బలిజల సంక్షేమానికి కృషి..

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని శెట్టి బలిసిన సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణ పరిధిలోని బంగారుగడ్డ వద్ద ఏర్పాటుచేసిన శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పద కాలలో శెట్టి బలిజలకు తగు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బంగారుగడ్డ పరిధిలో 600 గజాల స్థలాన్ని సొంత నిధులతో శెట్టి బలిజలకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనునిత్యం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్యామనాథ శర్మకు సంక్రాంతి జాతీయ పురస్కార అవార్డు

నవతెలంగాణ-జోగిపేట



భక్త రామదాస్ పదో తరం వారసుని చేతుల మీదుగా సంక్రాంతి జాతీయ పురస్కారం శ్రీ తిరుమల ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు శ్యామనాథ శర్మ ఆదివారం అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలను చేసిన వారిని గుర్తించి వారికి వరంగల్‌లో కన్నతల్లి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి జాతీయ పురస్కారాలను అందచేశారు. అందులో భాగంగా ఆందోల్ శ్రీ తిరుమల ఫౌండేషన్‌కు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా శ్యామనాథ శర్మ మాట్లాడుతూ.. తిరుమల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని, సేవా కార్యక్రమాలను మరిం తగా చేపడతామన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీ తిరుమల ఫౌండేషన్ అధ్యక్షులు రొయ్యల శేఖర్, ఉపాధ్యక్షులు శివప్ర సాద్, ప్రధాన కార్యదర్శి తోట్ల రామకృష్ణ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు రొయ్యల సత్యం, కోశాధికారి అశోక్, సలహాదారులు రాజు, ప్రవీణ్ కుమార్, నరేష్, సందీప్, అక్షయ్ పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగాలుగా గుర్తించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఐకేపీ వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులకు గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. వీవోఏల జిల్లా కమిటీ సమావేశం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించగా నిర్వహించారు. ఈ సందర్భంగా జి. సాయిలు మాట్లాడుతూ.. ఐకేపీ వీవోఏలు గత 15 ఏండ్ల నుంచి అనేక ప్రభుత్వ పనులు చేస్తున్నప్పటికీ వారికి రూ.3,900 మాత్రమే చెల్లించడం దుర్మార్గమన్నారు. వారికి కనీస వేతనం, చట్టపరమైన సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి సెర్ఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాట తప్పదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నగేష్, ముస్తఫా, నాయకులు అనిత, మల్లయ్య, మంజుల, భాగ్యశ్రీ, కాజా, ఆంజనేయులు, వీరేశం, రాజు, ప్రవీణ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు సామాజిక సేవకు కదలాలి

నవతెలంగాణ-జిన్నారం, ఐడీఏబొల్లారం



పరిశ్రమలు సామాజిక సేవా దృక్పథంతో ముందుకు కదలాల్సిన అవసరాన్ని గుర్తించాలని గడ్డపోతారం సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి అన్నారు. ఆదివారం జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం జిల్లా పరిషత్ హైస్కూల్లో న్యూలాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగావైద్య శిబిరంలో ఆయన ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యూల్యాండ్ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యకలాపాల నేపథ్యంలో ప్రజలకు ఎంతో మేలు చేసే వైద్య శిబిరం లాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం ఆరోగ్యం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు శిబిరాలు నిర్వహించడానికి పరిశ్రమ వర్గాలు ముందుకు రావాలన్నారు. కాగా ఈ ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరానికి హాజరైన వారికి న్యూలాండ్ కంపెనీ డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు కార్పొరేట్ హాస్పిటల్ డాక్టర్ల బృందంతో వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, డెంటల్ చెకప్, గైనేకాలజీ, ఈసిజి, జనరల్ ఫిజీసియన్, డైటీసియన్ లాంటి 12 రకాల పరీక్షలు చేశారు. మెడికల్ కిట్లు, మందులు, కంటి పరీక్షలకు సంబంధించిన కళ్ళజోడు ఉచితంగా అందించారు.సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, ఎంపీటీసీ జనాభాయి, మాజి సర్పంచ్ లు ఎంపి అశోక్, నీరుడి శ్రీనివాస్, న్యూలాండ్ సంస్థ తరపున డివి రెడ్డి, శారద,హెచ్ఆర్జిఎం రవి, సురేష్ బాబు, యాద గిరి కంపెనీ డాక్టర్స్ సంతోష్, మెల్విన్, మోడల్ అసోసి యేషయిన్ ప్రెసిడెంట్ మూర్తి, మాజీ సర్పంచ్‌లు వార్డ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

జితేందర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మునిపల్లి

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ మహిళా యాంకర్, విలేఖరికి టీఏజేఎఫ్ అధ్యక్షుడు తనుగుల జితేందర్ తనవంతు సాయాన్ని అందించి ఆదర్శంగా నిలిచాడు. దీంతో ఆయన చిత్రపటానికి సదరు మహిళా విలేకరి ఆదివారం క్షీరాభిషేకం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. కొంశెట్టిపల్లి గ్రామానికి చెందిన సంగీత ఒక యూట్యూబ్ ఛానల్‌లో పనిచేస్తూ ఉండేది. ఆ ఛానల్ యజ మాన్యం సరైన వేతనం ఇవ్వలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. దీనికితోడు భర్త అనారోగ్యం, మామ మరణించడం, తనకూ అనారోగ్య సమస్యలు రావడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. ఈ సమయంలో తోటి విలేకరి మహబూబ్ సూచనల మేరకు టీఏజేఎఫ్ అధ్యక్షుడు జితేందర్‌కు ఫోన్ ద్వారా తన పరిస్థితిని సంగీత వివరిం చింది. దీంతో ఆయన వెంటనే స్పందించి తన వంతుగా రూ.10,000 సాయం అందించారు. దీంతో ఆదివారం జితేందర్ చిత్రపటానికి ఆమె పాలాభిషేకం చేసి సంతోషాన్ని వ్యక్తం చేసింది. టీఏజేఎఫ్ జిల్లా ఇంచార్జ్ చాపల సత్యం, షేక్ మహిబూబ్, (థామస్) నర్సిములు, రాజు, వీరేశం, కుమార్, సురేష్.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలో1991-92 పదో తరగతి విద్యార్థి బృందం పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు తమ బాల్య దశ పాఠశాల జీవితం, జీవితంలో స్థిరపడడానికి ఎదుగుదల, కుటుంబాలు తదితర అనేక అంశాలపై ఆత్మీయంగా పలకరింపులతో చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి తమ గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ మధ్య జీవించిలేని వారికి నివాళులర్పించారు. జిన్నారం మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంగు రమేష్, సోలక్పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వీరేష్, వేణు, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు పట్టాల పంపిణీ

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు సంబంధించి లబ్దిదారులకు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు లేని నిరుపేదల కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని అడుక్కోవడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. లాటరీ పద్దతి ద్వారా డబుల్ బెడ్రూం లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగినప్పటికీ పంపిణీ అడ్డుకోవడానికి కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చే ప్రయత్నం చేశారన్నారు. అయినప్పటికీ కోర్టు స్టే ఇవ్వలేదన్నారు. కోర్టు చెప్పినట్టు ఎనిమిది మంది లబ్దిదారుల కోసం రిజర్వ్‌లో ఉంచినట్టు అధికారులు తెలిపారన్నారు. త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా గృహప్రవేశ కార్యక్రమం ఉంటుందన్నారు. మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్, సునీల్ కుమార్, అర్పుత్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 5 పరిధిలోని మాధవపురి హిల్స్ కాలనీలో రూ.85 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘం ప్రతినిధులు చైర్మెన్ టీపీఆర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రూ.25 కోట్లతో పాటు, మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. మున్సిపల్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. తదనంతరం శ్రీకృష్ణ బృందావన్ త్రిపుర కాలనీ, కేఎస్ఆర్ కాలనీ, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వివిధ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. నిరుపేద ప్రజల కోసం స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు మహాదేవరెడ్డి, ఉపేందర్ రెడ్డి, గోపాల్, బిజిలి రాజు, కొల్లూరి మల్లేష్, కృష్ణ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యం

నవతెలంగాణ-గుమ్మడిదల



అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమ వుతుందని పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం గుమ్మడిదల మండలం కానుకుంటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం తన సొంత నిధులతో నిర్మించిన రజక సంఘం షెడ్డును నీలం మధు ముదిరాజ్ ప్రారంభించారు. గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ తల్లి దేవాలయానికి ఒక లక్ష రూపాయల విరాళం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ను ఆదర్శంగా తీసు కొని తాను అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కష్టాల్లో ఉన్న ప్రతీ ఒక్కరికి అండగా నిలుస్తు న్నానన్నారు. తనకు అండగా నిలుస్తున్న ప్రజల స్ఫూర్తితో ముందు మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తానన్నారు. వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్, రజక సంఘం గ్రామ అధ్యక్షులు నర్సంగారి శేఖర్, రజక సంఘం సభ్యులు పోచయ్య, సిహెచ్ వెంకటేష్, సోమల యాదగిరి, మల్లేష్, భాను, సత్తయ్య, రమేష్, తిరుపతి, బిక్షపతి, కృష్ణ, యాదయ్య, సత్తయ్య, పుట్ట నాగులు, మురళి, వినయ్, నరేష్, నవీన్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కానుకుంట చౌరస్తా అడ్డాలో సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల గ్రామపంచాయతీ పరిధిలోని కానుకుంట చౌరస్తా దగ్గర గల బస్టాండ్ సమీపంలో ఉన్న అడ్డాలో కనీస సౌకర్యాలు లేక మహిళలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అడ్డా దగ్గర నుంచే నిత్యం వందలాది మంది ఉపాధి పనులకు వెళ్తుంటారు. స్కూలు, కాలేజీ విద్యార్థులు కూడా ఇక్కడే బస్సుల కోసం వేచి ఉంటారు. కొడిపల్లి, నర్సాపూర్, దౌల్తాబాద్‌లాంటి దూర ప్రాంతాల నుంచి కూడా నిత్యం ఇక్కడికి వచ్చి అడ్డా కూలీలుగా పనులు చేసుకుంటున్నారు. అయితే ఈ అడ్డాలో కనీస మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో మహిళా కూలీలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకవర్గం, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని కూలీలు వాపోతున్నారు. గుమ్మడిదల మండల కేంద్ర మంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు.. తప్పా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మానవతా దృక్పథ ంతో స్పందించి అడ్డా దగ్గర మరుగుదొడ్లు నిర్మించాలనికోరుతున్నారు.

నాణ్యతాలేమిగా అభివృద్ధి పనులు

నవతెలంగాణ-నారాయణఖేడ్



నియోజకవర్గంలో చేపడుతున్న సీసీరోడ్లు, మురికి కాలువలు, పంచాయతీ రాజ్ భవన నిర్మాణాలను నాణ్యతా లోపంతో నిర్మిస్తున్నారని సీపీఐ(ఎం) ఏరియా కమిటీ సభ్యులు చిరంజీవి ఆరోపించారు. అధికారులు చూసి చూడనట్టుగా వ్యవరిస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో పంచాయతీరాజ్ ద్వారా పనులు చేపడుతున్నా వాటికి కనీసం నీళ్లు పోసే పరిస్థితి కూడా లేదన్నారు. ఈ నిర్మాణా ల్లో ఎక్కువ శాతం డస్ట్ వాడుతున్నరని, ఇసుక ఎక్కువగా వాడడం లేదన్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. నిర్మా ణాలు పూర్తిగా జరగకుముందే 100శాతం బిల్లులు చెల్లిస్తున్నారని.. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజావాణి ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామ న్నారు. పార్టీ సభ్యులు మోసప్ప, సిద్ధు, సాయిలు పాల్గొన్నారు.

కుటుంబ పాలనను గద్దె దించడంలో యువత ముందుండాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్రంలో కుటుంబ పాలనను గద్దె దించేందుకు యువత ముందుండాలని బీజేపీ నాయకులు శివరాజ్ పాటిల్ పిలుపునిచ్చారు. సుమారు 300 మంది యువకులు, 100 మంది మహిళలు ఆయన సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృధి కార్యక్రమాలకు, బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రకు ఆకర్షితులై యువత ఏకతాటిగా బీజేపీ వైపు మొగ్గు చూపు తున్నదన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ బలోపే తం కోసం తనవంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం యువత ముందుండాలన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ పాలక్ మోహన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, కో కన్వీనర్ సత్యనారాయణ, పార్లమెంట్ కో కన్వీనర్ కొవ్వూరి సంగమేశ్వర్, జగిత్యాల జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్ ఒడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తోట చంద్రశేఖర్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షులు రవిశంకర్ పాల్గొన్నారు.

కరుణాకర్ రెడ్డిని సన్మానించిన వ్యవసాయ శాఖ అధికారులు

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన నారాయణఖేడ్ వ్యవసాయ శాఖ మాజీ ఏడిఏ కరుణాకర్ రెడ్డిని వివిధ జిల్లాలకు చెందిన ఏడీఏలు ఆదివారం ఘనంగా సన్మానించారు. జహీరాబాద్ పట్టణంలోని కరుణాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి స్వచ్ఛందంగా పదవి విరమణ చేసినందుకుగాను శుభాకాంక్షలు తెలిపారు. సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, వికారాబాద్ ఏడీ వినోద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, గుడ్‌పల్లి ఏఈఓ ప్రవీణ్ కుమార్‌లు తదితరులు ఉన్నారు.



మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎఫ్‌డీసీ చైర్మన్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ బోల్తాపడి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన రైతు నాగరాజు కుటుంబాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదివారం పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు గత వారం రోజుల క్రితం తన స్వంత వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో దున్నకాలు చేపడుతున్నారు. కాగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడడంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అలాగే ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రతాప్‌రెడ్డితో పాటు ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డిలతో పాటు నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

మహిళ కమిషన్ చైర్ పర్సన్ సునీతా రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి అన్నారు. హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన శంకర్ అనారోగ్యంతో గత కొద్ది రోజుల నుంచి బాధపడుతున్నారు. ఆయనకు నిమ్స్‌లో మెరుగైన చికిత్స అందించేందుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీ చెక్కును ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి నివాసంలో శంకర్, మహిళ కమిషన్ చైర్పర్సన్ సునీత రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, చింత స్వామి, సుధాకర్ రెడ్డి, నాగేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-రేగోడు

సైబర్ నేరాలపై రేగోడు పోలీసులు ఆదివారం రేగోడు గాంధీచౌక్ ఆవరణలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాలను అరికట్టాలన్నారు. మైనర్ బాలికలకు పెళ్లిళ్లు చేయకూడదని సూచించారు. అదేవిధంగా ఫోన్లకు ఓటిపి పేరుతో మెసేజ్‌లు వస్తే రెస్పాన్స్ ఇవ్వొద్దని ఆయన ప్రజలకు సూచించారు. మీకు ఏదైనా లావాదేవీల సమస్యలు ఉంటే బ్యాంకులకు వెళ్లి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లయ్య పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటు పడతా



నవతెలంగాణ-టేక్మాల్

గ్రామాభివృద్ధి కోసం పాటుపడతానని కోరంపల్లి సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోరంపల్లి గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌ను కోరగానే నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఆ నిధుల నుంచి రూ. 7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఈ రోడ్డు వేయడం వలన, గ్రామస్తులకు వ్యవసాయ పనుల కోసం వెళ్లే తమ వ్యవసాయ క్షేత్రాలకు అనువుగా ఉంటుందన్నారు. మిగిలిన నిధులతో ఎక్కడ అవసరాలు ఉన్నా అక్కడ సీసీ రోడ్ల నిర్మాణాలు, మురికి కాలువల నిర్మాణాలు చేపడతామని చెప్పారు. గ్రామాభివృద్ధి కోసం అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డ్ మెంబర్లు, ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రైతు లింగం (40) గత మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించి రూ. వేల ఆర్థిక సహాయాన్ని మృతుని భార్య లలితకు అందజేశారు . కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం నమోదు చేసినందున రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని త్వరలోనే అందజేస్తామన్నారు ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సుప్రభాతారావు, మండల అధ్యక్షుడు బక్కన్న గారి లింగం గౌడ్. మధుసూదన్ రెడ్డి, కల్వకుంట మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, కల్వకుంట పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, రజాక్ పల్లి మాజీ సర్పంచ్ చిన్న నారా గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

చేగుంట ముదిరాజ్ సంఘం ఎన్నికలు



నవతెలంగాణ- చేగుంట

చేగుంట పట్టణ కేంద్రంలో ఆదివారం ముదిరాజుల సంఘం ఎన్నికలు రామయంపేట్ రోడ్‌లో పోచమ్మ ఆయలయం ఆవరణలో జరిగాయి. ఈ ఎన్నికల్లో ముదిరాజుల సంఘం అధ్యక్షులుగా తలారి లింగం, ఉపాధ్యక్షులుగా దుంపల (డిష్) రాజు , కార్యదర్శిగా దొడ్డ మహేష్, కోశాధికారిగా తలారి శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా భుడ్డ ఎల్లం లు ఎన్నికయ్యారు. ముదిరాజ్ సంఘం వీరికి పూర్తి బాధ్యతలు అప్పజెప్పారు. అధ్యక్ష ఉపాధ్యక్షులుగా తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన ముదిరాజ్ సంఘంలోని ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ వంతు బాధ్యతగా ముదిరాజ్ సంఘానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆర్థిక సాయం



నవ తెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని పోతులబోగుడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నెల్లూరు పోచయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా . పోతులబోగుడ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సాయంగా బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షర్బయ్య , పీఏసీఎస్ డైరెక్టర్ పెంట గౌడ్, నాయకులు ప్రశాంత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ సేవలో ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో జరిగే తిరుమల స్వామి గరుడ సేవలో ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్ పాల్గొన్నారు. తిరుమల స్వామి బ్రహ్మో త్సవాలు గత 2 రోజుల నుంచి అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేల సంఖ్యలో భక్తులు తిరుమల స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ కార్య క్రమంలో బ్రాహ్మణ పండితులు, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్, కమిటీ మెంబర్ తిరుమలయ్య, సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేచర్ ఐకాన్ యూత్ సేవలు అభినందనీయం

250 వారాలుగా కొనసాగుతున్న స్వచ్ఛభారత్

29ఎంఎస్‌బి01

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామాభివృద్ధి స్వచ్ఛతే ముఖ్యంగా నేచర్ ఐకాన్ యూత్ చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు అభినందనీయమని స్వచ్ఛభారత్ ఇతర గ్రామాలకు ఆదర్శం గా నిలుస్తుందని గ్రామ మాజీ కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి వేణు గోపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో గ్రామ స్వచ్ఛతే లక్ష్యంగా నేచర్ ఐకాన్ యూత్ చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం 250 వారాలుగా కొనసాగుతుంది. ఆదివారం గ్రామంలో 250 వారంను పురస్కరించుకుని యువతతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అలాగే గ్రామంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని, గ్రామ అభివీద్ధి, స్వచ్ఛతపై నినాదాలు చేశారు. అనంతరం చెరువుకు వెళ్లే దారితో పాటు రైతు వేదిక వద్ద యువత పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. గత 250 వారాలుగా గ్రామంలో అభివృద్ధితో పాలు స్వచ్ఛత, గ్రామంలో ఉన్న సమస్యలపై పరిష్కారానికి తోడ్పతున్న యువత నేచర్ ఐకాన్ టీం సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న స్వచ్ఛబారత్ కార్యక్రమం మండలంలోనే కాకుండా ఇతర మండలాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయి. నేచర్ ఐ కాన్ టీం సభ్యులకు గ్రామ ఒకటో వార్డు సభ్యులు శ్రీహరిగౌడ్ పనిముట్లను అందజేశారు. నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు చేపట్టిన స్వచ్ఛబారత్‌కు గ్రామంలోని యువతతో పాటు చిన్నారులు సైతం పాల్గొని మొక్కలు నాటడం, వీధులను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతూ గ్రామాభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మురుగు కాల్వ పనులు చేపట్టి సమస్యలు పరిష్కరించాలి

ఉపసర్పంచ్ నూకల వెంకటేశ్‌యాదవ్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మురుగు కాలువ మంజూరు అయినప్పటికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పనులు మొదలు చేయకపోవడంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులను చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామ ఉపసర్పంచ్ నూకల వెంకటేశ్‌యాదవ్, వార్డు సభ్యులు చింతల బాబుముదిరాజ్‌లు కోరారు. ఆదివారం మురుగు కాల్వను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండాపూర్ గ్రామంలోని మురుగు కాల్వల నిర్మాణానికి గత రెండు సంవత్సరాల క్రితం గడ, ఈజీఎస్ నుంచి పది లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ చింతల మమత రవిముదిరాజ్‌ల కృషితో నిధులు మంజూరైనప్పటికి నిర్మాణం చేపట్టడంలో కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వారు తెలిపారు. గ్రామంలో మురుగు కాల్వ నిర్మాణం చేవట్టకపోవడంతో మురుగు నీరు పేరుకుని తీవ్ర దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే పనులను ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి కాకపోవడంతో ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావాలని కోరితే ఉన్న పనులే పూర్తి చేయలేదని మరిన్ని పనులు ఎలా ఇవ్వాలని అధికారులు అంటున్నట్టు వారు తెలిపారు వెంటనే పెండింగ్ పనులను పూర్తి చేసి గ్రామాభివృద్ధితో పాటు ప్రజల ఇబ్బందులను తీర్చాలని ఉపసర్పంచ్ నూకల వెంకటేశ్‌యాదవ్ కోరారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-నర్సాపూర్

సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు సుమారు 50 మంది ఆదివారం నర్సాపూర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్‌లు మాట్లాడుతూ టీఆర్ఎస్ బీజేపీ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగు చెంది ఆ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, కిష్టయ్య, నాయకులు శ్రీనివాస్ గుప్తా, మణిదీప్, సురేష్ నాయక్, శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు ఉన్నారు.

ఇంటి యజమానులకు సౌకర్యంగా.. కార్మికులకు అండగా... శ్రామిక్ సంధాన్ యాప్



నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటి యజమానులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడం కోసం, కావలసిన కార్మికులను ఇంటి యజమానులకు చేరవేయడం కోసం, పని కోసం వచ్చే కార్మికులకు పని కల్పించడం కోసం జిల్లాలోనే మొట్టమొదటిసారిగా శ్రామిక్ సంధాన్ యాప్‌ను ఫౌండర్ నరేష్, కార్మిక సంఘం నాయకుడు కర్ణాకర్‌లు ఏర్పాటు చేశారు. సిద్దిపేట పరిసర ప్రాంతాల భవన, ఇతర నిర్మాణ కార్మికుల ఉపాధి కొరకు రూపొందించిన శ్రామిక్ సంధాన్ యాప్‌ను గౌరవ యూనియన్ అధ్యక్షులు మచ్చ వేణు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా పట్టణంలోని శరభేశ్వర ఆలయం సమీపంలోని కార్యాలయంలో ప్రారంభించారు. ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకుంటే ఎవరికైనా ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా వీరు కల్పించడానికి ఏర్పాట్లను చేశారు.

సౌకర్యాలే కాదు... చైతన్యం..

మచ్చ వేణు గోపాల్ రెడ్డి
భవన, ఇతర రంగాల కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు

శ్రామిక్ సంధాన్ యాప్‌లో భవన, ఇతర నిర్మాణ కార్మికులైన గుత్తేదారు, లేబర్‌కు ఉచితంగా వారి ఇంటి వద్దనే పని కల్పించడం జరుగుతుంది. ప్రభుత్వ పథకాలైన మ్యారేజ్ అయినప్పుడు, పిల్లలు పుట్టినప్పుడు, పని చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఏదయినా దుర్ఘటన జరిగినపుడు, లేబర్ కార్డు ద్వారా వచ్చే పథకాలను కార్మికులకు తెలియజేస్తూ చైతన్యం చేయడం. లేబర్ కార్డు గడువు తేది ముగిసినపుడు, లేబర్ కార్డు రిన్యూవెల్ చేసుకునేలా కార్మికులకు తెలియజేయడం.

సొంత ఇల్లు కట్టుకునే స్వప్నం నెరవేర్చడమే

- నరేశ్, శ్రామిక్ సంధాన్ యాప్ ఫౌండర్



స్వంత ఇల్లు కట్టుకోవడం అనేది ప్రతి ఒక్కరి స్వప్నం. అలాంటి వారి స్వప్నం సులువుగా నెరవేర్చాలనేదే మా ఉద్దేశం. అందుకే ఈ యాప్‌ను రూపొందిచాము. ఇంటి ఓనర్‌లు తమ ఇంటి నిర్మాణానికి కావాల్సిన పనికి నమ్మకమైన వర్కర్స్ కోసం ఎవరిని అడగాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఈ యాప్‌లో ఇల్లు కట్టుకోవాలనుకునే వారు వారి ఇంటి నిర్మాణానికి కావాల్సిన వర్కర్స్, సామాగ్రి (పెయింట్, మార్బల్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ మొదలగునవి...)ని ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకోవచ్చు. కొత్త ఇల్లు కట్టుకునే వారు తమను సంప్రదిస్తే మంచి అనుభవం గల బిల్డర్లతో అతి తక్కువ ఖర్చుతో ఇల్లు నిర్మించి ఇస్తాము. ఈ యాప్ ద్వారా ఇప్పటికే చాల మంది తమ ఇంటికి కావాల్సిన సామగ్రిని, వర్కర్స్‌ను బుక్ చేసుకొని యాప్ సేవలను పొందుతున్నారు. అలాగే ప్రతి ఒక్కరు ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకొని ఉపోయోగించుకోవాలి.

చేతి నిండా పని దొరుకుతుంది

కర్ణాకర్, కార్మికుడు, సంఘం ప్రధాన కార్యదర్శి.



నేను గత 15 సంవత్సరాలుగా సుతారి, డ్రిల్లింగ్ పని చేస్తున్నాను. భవన, ఇతర నిర్మాణ కార్మికులు పని దొరక్క చాల మంది ఇంటి వద్దనే ఉండిపోతున్నారు. అలాంటి వారికి ఉపయోగపడేలా ఉచితంగా ఇంటి వద్ద నుంచే పని కల్పించడానికి ఈ యాప్ చాలా ఉపయోగకరంగా ఉంది. ఈ యాప్ ద్వారా ఇప్పటికే తాను చాలా సార్లు పనికి వెళ్ళాను. యూనియన్ ద్వారా లేబర్ కార్డు తీసుకొని, మా ఇద్దరు పిల్లలు పుట్టినపుడు ఒక్కొక్కరికి 30000 చొప్పున మొత్తం 60000 పొందాను.

కల్పిస్తున్న సౌకర్యాలు....

- ఇంటి యజమానులకు వారి దగ్గరలో ఉన్న నమ్మకమైన, అనుభవం ఉన్న గుత్తేదారు, లేబర్‌ని అందించడం.
- భవన, ఇతర నిర్మాణ గుత్తేదారు, లేబర్స్‌కు ఉపాధి కల్పించడం.
- ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను గుత్తేదారు, లేబర్స్‌కు తెలియచేయడం, వాటిని అప్లై చేసుకునేలా చైతన్యం చేయడం.
- భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి వారికీ ఐడి కార్డు (గుర్తింపు కార్డు) అందచేయడం.
- ఇంటి నిర్మాణానికి కావాల్సిన సామాగ్రిని అతి తక్కువ ధరలో అందించడం, వారికి దగ్గరలో గల షాప్ వివరాలను అందించడం.
- గ్రామ గ్రామాన అన్ని రంగాల కార్మికులను చైతన్యం చేస్తూ ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను అందే విధంగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం.
- తమ నివాస ప్రాంతాలలోనే కార్మికులకు పనులు కల్పించడం.
- ఇంటి యజమానులకు వివిధ ప్రాంతాలలో కార్మికుల కోసం తిరగడం, ఎంక్వయిరీ లాంటి ఇబ్బందులు లేకుండా యాప్ ద్వారా వారికి సహకరించడం.

రాష్ట్ర అవార్డు గ్రహీతలకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-జగదేవపూర్

ముదిరాజ్ జాతి బిడ్డలకు రాష్ట్ర బీసీ రత్న అవార్డులు రావడం తమ జాతీకి గౌరవంగా ఉందని ముదిరాజ్ సంఘం నాయకులు సాయిలు, చేబర్తి ఉపసర్పంచ్ స్వామిలు అన్నారు. జగదేవపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు ముదిరాజ్ జర్నలిస్ట్ బలరాం ముదిరాజ్ లకు ఇటీవల బీసీ రత్న రాష్ట్ర అవార్డ్‌లు వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం చేబర్తి ముదిరాజ్ సంఘం నాయకులు సాయిలు, స్థానిక ఉపసర్పంచ్ స్వామి ముదిరాజ్ నాయకులు మల్లెశం, ముదిరాజ్ నర్సింలు ముదిరాజ్‌లు బీసీ రత్న రాష్ట్ర అవార్డ్ గ్రహీతలు రాజు ముదిరాజ్, జర్నలిస్ట్ బలరాం ముదిరాజ్‌లను శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ముదిరాజ్ సంఘం హక్కుల సాధనతో పాటు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ మండల ముదిరాజ్ సంఘం కోశాధికారి కొంపెల్లి శ్రీనివాస్ ముదిరాజ్ గజ్వేల్ ముదిరాజ్ సంఘం నాయకులు కనకయ్య ముదిరాజ్ జనార్ధన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తొగుట

నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలి, ఆకుపచ్చని ప్రాంతంగా కావాలని, గ్రామాలు శర వేగంగా అభివృద్ధి జరగాలని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని ఘణపూర్ గ్రామంలో కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజచేశారు. అనంతరం గ్రామ ప్రజల సమస్యలు ఎమ్మె ల్యే అడిగి తెలుసుకున్నారు.సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారం చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, ఎంపీ టీసీ కొమ్ము శరత్,బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నంట స్వామి రెడ్డి, గుడికందుల ఉప సర్పంచ్ మల్లు గారి శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి పెట ఉప సర్పం చ్ ప్రవీణ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పరమేష్,బీజేవైయం మండల అధ్యక్షుడు కళ్యాణ్ దాస్, కొమ్ము కరుణాకర్,శ్రవణ్ రెడ్డి,తిరుపతి,రాజశేఖర్, ప్రభాకర్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి కంటి వెలుగు



నవతెలంగాణ-సిద్దిపేట

31 నుంచి 22వ వార్డులోని సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో రెండో విడత కంటి వెలుగు శిబిరం ప్రారంభమవుతుందని 4వ వార్డ్ కౌన్సిలర్ కొండం కవిత, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సంపత్ రెడ్డిలకు టోకెన్‌లను ఇచ్చి తమ కంటిని పరీక్షించుకోవాలని టీఎంసీ సాయికృష్ణ కోరారు. ఆదివారం 22వ వార్డులో నివాసం ఉంటున్న వారికి మున్సిపల్ సిబ్బంది టోకెన్లను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కవిత సంపత్ రెడ్డిలు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావులు చేపడుతున్న ప్రతి పథకం పేదలకు సంబంధించిందేనని, రెండో విడత కంటి వెలుగు ద్వారా అనేక మందికి కంటి వెలుగుతో పాటు, ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తాము కూడా 31న వెళ్లి కంటి పరీక్షలను చేయించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు మంజుల, శిరీష, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, ఓఎస్డీ బాలరాజు ఆదివారం గ్రామంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వైకుంఠ దామం, హెల్త్ సబ్ సెంటర్, మంచి నీటి ట్యాంక్, పల్లె ప్రకృతి వనం, సీసీ రోడ్డు పనులకు త్వరలో మంత్రి తన్నీరు హరీశ్ రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. గ్రామ సర్పంచ్ ఎల రాజేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించడానికి గ్రామానికి వచ్చారు. గ్రామంలోని పలు అభివృద్ధి పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని గ్రామ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కమాల్ షరీఫ్, రంగు రాజు గౌడ్, జాజాల చందు, ఉప సర్పంచ్ పి.మహేష్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పరమాండ్ల మల్లేశం, వార్డు సభ్యులు బాలరాజు, మధు, గ్రామ యువకులు బాలరాజు, వంశీ, బాలకిషన్, రవి, రాజేందర్, గుడిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

31న మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలో నూతనంగా నిర్మించిన వాణిజ్య దుకాణాలకు ఈ నెల 31న ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు. ఒకటో వార్డులోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో నిర్మించిన 8 షట్టర్లు, 14 వార్డు లోని శాస్త్రి విగ్రహ కూడలి నిర్మించిన 13 (గ్రౌండ్ ఫ్లోర్-7, ఫస్ట్ ఫ్లోర్-6) దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందన్నారు.

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతాం

ప్రభుత్వాల మోసాలను ప్రజలకు వివరిస్తాం
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, ప్రజలను చైతన్య పరుస్తూ పార్టీని బలోపేతం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ మేధావులపైన కుట్ర కేసులు పెడుతున్నట్లు విమర్శించారు. బీజేపీ హయాంలో ప్రాథమిక హక్కులు సైతం దక్కకుండా పోయాయని చెప్పారు. దేశ సంపదనను కొంతమంది గుప్పెట్లో ప్రధాని నరేంద్ర మోడీ దాచిపెడుతుండడంతో కార్పొరేట్ రంగం నిర్వీర్యమై 20 కోట్ల మంది వలస కార్మికులు అన్నమో రామచంద్రా అంటూ అలమటిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు ఉపాధి కరువై, విద్య, వైద్యం దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాల కోసం సీపీఐ పోరాటం చేస్తుందని, రూ.5 లక్షలు మంజూరు చేసి పేదలకు గూడు కల్పించాలని తెలిపారు. రైతులకు సమస్యగా మారిన ధరణి పోర్టల్‌ను సరిచేయాలని, లేదా రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వేల్పుల బాలమల్లు, యెడల వనేశ్, కనుకుంట్ల శంకర్, కిష్టపురం లక్ష్మణ్, అందే అశోక్, పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

మండలం పరిదిలోని చిన్నకిష్టపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కేసీఆర్ క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారన్నారు. వివిధ క్రీడలకు సంబంధించిన కోచ్‌లు గజ్వేల్‌లో క్రీడాకారులను తయారు చేయాలన్నారు. గజ్వేల్‌లో 28 ఎకరాలలో క్రీడా మైదానం ముస్తాబు అవుతుందన్నారు. గజ్వేల్ నుంచి జిల్లా, రాష్ట్రం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసేలా కోచ్‌లు కష్టపడాలన్నారు. భవిష్యత్తులో క్రీడాకారులకు క్రీడలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు క్రీడలు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తాయని అలాగే మంచి క్రమశిక్షణ కూడా ఏర్పడుతుందన్నారు. నేటి సమాజంలో ఫోన్లు, టీవీలు, మీడియా సమస్యల వల్ల పిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఊబకాయం లాంటి సమస్యలతో బాధపడుతున్నారని ఆటలు ఆరోగ్యాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనకయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ రాజు, టీచర్ రాజీ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విరసత్ అలి, జిలానీ, క్రీడాకరులు, బీఆర్ఎస్ నాయకులు తదితులున్నారు.

చైర్మన్ కుర్చీ కోసం కుస్తీ



రసవత్తరంగా మారుతున్న రాజకీయం

నవతెలంగాణ-చేర్యాల

సిద్దిపేట జిల్లాలోని చేర్యాల మున్సిపాలిటీలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. చైర్‌పర్సన్‌పై వ్యతిరేకతతో మున్సిపల్ కౌన్సిలర్ల రహస్య విందులు, సమావేశాలతో రోజురోజుకు రాజకీయాలు ముదురుతున్నాయి. కొత్తగా ఏర్పడిన చేర్యాల మున్సిపాలిటీలో 2020 జనవరిలో 12 కౌన్సిలర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ 5స్థానాలు, కాంగ్రెస్ 5 స్థానాలు దక్కించుకోగా 2 స్థానాల్లో స్వతంత్రులు విజయం సాధించారు. ఈ క్రమంలో ఇద్దరు స్వతంత్రులు అధికార పార్టీకి మద్దతు ఇవ్వడంతో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పదవిని దక్కించుకుంది. చైర్మన్ పదవి మహిళా రిజర్వు కావడంతో పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న అంకుగారి శ్రీధర్ రెడ్డి భార్య స్వరూపరాణి చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. మద్దతు తెలిపిన ఇద్దరు స్వతంత్రుల్లో ఒకరు నిమ్మ రాజీవ్ రెడ్డికి వైస్ చైర్మన్ పదవి కేటాయించగా మరొకరు జుబెదా ఖాతూన్- ఇక్బాల్‌కు కీలక పదవి ఇస్తామని అప్పట్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ తిరిగి తెర మీదకు వచ్చింది. పాలకవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు గడవడంతో మున్సిపల్ కౌన్సిలర్ జుబేదా ఇక్బాల్ తమకు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయించాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డితో పాటు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హెూం మంత్రి మహమ్మద్ అలీకి వినతిపత్రాలు సమర్పించారు. దీంతో చేర్యాల మున్సిపాలిటీలో అసంతృప్త బీఆరెస్ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లతో రహస్య సమావేశాలు, విందులతో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. సమావేశాల్లో ముందస్తు హామీ ప్రకారం చైర్మెన్ పదవి దక్కకుంటే అవిశ్వాస తీర్మానం పెట్టాలనే దిశగా మెజారిటీ కౌన్సిలర్లు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లను పిలిపించుకొని మంతనాలు జరిపినప్పటికి అవిశ్వాసం దిశగానే మెజారిటీ కౌన్సిలర్లు మొగ్గు చూపుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. పాలకవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తుండడంతో మున్సిపల్ చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి పలువురు కౌన్సిలర్లు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే అసంతృప్త కౌన్సిలర్లకు కౌంటరుగా చైర్మన్ సైతం కొందరు కౌన్సిలర్ల మద్దతు కూడబెట్టుకోవడం కోసం తమదైన శైలిలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఎదేమైనప్పటికీ మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ తెరపైకి రావడం, చైర్మన్ మార్పు వంటి అంశాలతో చేర్యాల మున్సిపాలిటీలో రాజకీయాలు రోజురోజుకు ముదురుతుండడం స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.



పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని నేడు, రేపు జిల్లా వ్యాప్త ఆందోళనలు : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-చేర్యాల



పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ప్రశాంత్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమ, మంగళ వారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని, పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, హాస్టల్‌లకు సొంత భవనాల ఏర్పాటు చేయాలని, మెస్ కాస్మొటిక్ ఛార్జీలను పెంచాలని, ప్రభుత్వ విద్యాసంస్థల మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి వాటికి నిధులు కేటాయించాలనే డిమాండ్‌లతో జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళ అన్ని మండలాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సుద్దాల భాస్కర్, గొల్ల సంజీవ్ యాదవ్, అరుణ్, మధు, మహేష్, హర్షవర్ధన్, రంజిత్ పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ- గజ్వేల్

రైతులను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో సాగు చేస్తున్న పంటలపై అవగాహనతో పాటు రైతుబిడ్డగా ఎంతో అనుభవం ఉన్న అమ్మదిపూర్ గ్రామానికి చెందిన మాదాసు శ్రీనివాస్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు నమ్మినబంటుగా ఉండడంతో రెండుసార్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. మొదటి రెండు సంవత్సరాలు ఆయన సతీమణి మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్‌కు మహిళా బీసీ స్థానంలో, జనరల్ స్థానంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రెండోసారి మాదాసు శ్రీనివాస్‌ను వరించింది. వ్యవసాయ మార్కెట్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రతిపాదనలు తదితర అంశాలపై మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ...

గజ్వేల్ మార్కెట్ పరిధిలో ఏ పంటలు సాగు చేస్తారు?

మార్కెట్ పరిధిలో మొత్తం మూడు మండలాలు గజ్వేల్, మర్కుక్, జగదేపూర్ మండలంలోని 55 గ్రామాలు ఉన్నాయి. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, వరి, కందులు, శనిగలు పంటలు సాగు చేస్తారు.

చెక్‌పోస్టుల ద్వారా సంవత్సరానికి ఎంత ఆదాయం వస్తుంది

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో రెండు చెక్‌పోస్టులు ఉన్నాయి. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్, జగదేపూర్ మండల కేంద్రంలో చెక్‌పోస్టు ఉంది. వీటి ద్వారా రూ.35 లక్షల ఆదాయం వస్తుంది. మొక్కజొన్న, వరి, పత్తిలపై మార్కెట్ ఫీజ్ వస్తుంది.

మార్కెట్లో ఎన్ని ట్రేడింగ్ లైసెన్స్ ఉన్నాయి? వాటి ద్వారా ఆదాయం ఉందా?

మార్కెట్ పరిధిలో మొత్తం 57 ట్రేడింగ్ లైసెన్సులు, ఆరు పత్తి మిల్లులు, వీటి ద్వారా సంవత్సరానికి రూ.1.80 కోట్ల ఆదాయం సమకూరుతుంది. మార్కెట్ యార్డులో 30 దుకాణాలు ఉన్నాయి. ఇందులో పత్తి, వరి, మొక్కజొన్న, కందులు, శనిగలు కొనుగోలు చేస్తారు.

ప్రతి సంవత్సరం ధాన్యం కొనుగోలు ద్వారా మార్కెట్ ఆదాయం ఎంత?

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక శాతం మార్కెట్ ఫీజు ప్రకారం రూ.50 లక్షల ఆదాయం వస్తుంది.

నూతన పత్తి మార్కెట్ యార్డు పనులు ఎంతవరకు వచ్చాయి?

మార్కెట్లో కవర్ షెడ్డు, డ్రాయింగ్ ప్లాంట్ ఫారం పూర్తయింది. సీసీ రోడ్డు, ఆఫీస్ భవనం పనులు జరుగుతున్నాయి. రైతులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా మార్కెట్ యార్డ్‌ను రూపుదిద్దుకుంటుంది.

మార్కెట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎంతమంది ఉండాలి. ఎన్ని ఖాళీలు ఉన్నాయి?

మార్కెట్ కమిటీ అధికార సిబ్బంది నలుగురు ఉండాలి. ఇందులో కార్యదర్శి, పర్యవేక్షకులు మాత్రమే ఉన్నారు. జేఎంఎస్, వాచ్మెన్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లో ఎన్ని లైసెన్స్‌లు ఉన్నాయి

గజ్వేల్‌లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్లో 246 స్టాల్స్ ఉన్నాయి. ఇందులో 90 స్టాల్స్ ఖాళీగా ఉన్నాయి. ఒకటి సూపర్ మార్కెట్, మరో 16 షాపులు ఉన్నాయి. మరో 9 షాపులు ఖాళీగా ఉన్నాయి. మార్కెట్లో ఆదాయం సంవత్సరానికి రూ.35 లక్షలు అద్దెల ద్వారా వస్తున్నాయి. మిగతా షాపులు కూడా భర్తీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అంతేకాకుండా మార్కెట్ ఏ పాత చాపల మార్కెట్ రోడ్ లో దుకాణాల సముదాయాన్ని ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

ఎరువుల రాక్ పాయింట్‌కు ఇంతవరకు ఎన్ని టన్నుల ఎరువులు, ఫర్టిలైజర్ వచ్చింది?

గజ్వేల్‌లో రైల్వేలైన్ పూర్తి కావడంతో రైతులకు కావాల్సిన ఎరువులను ప్రత్యేక రైలు ద్వారా తెప్పించాం. ఎన్ఎఫ్‌సీఎల్ యూరియా 6,817.995 మెట్రిక్ టన్నులు, సీఐఎల్ 20.20.13..055 మెట్రిక్ టన్నులు, సీఐఎల్ యూరియా 4218.055 మెట్రిక్ టన్నులు, స్పీక్ యూరియా 544.950 మెట్రిక్ టన్నులు, స్పీక్ డీఏపి 182.550 మెట్రిక్ టన్నులు, స్టిక్ 20 .20.13, 565.350 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది.





బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దాం : చైర్మన్

నవతెలంగాణ-దుబ్బాక

సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గడపగడపకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని, దుబ్బాక పురపాలికలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె భూమిరెడ్డి అన్నారు. పట్టణంలోని 39వ బూత్ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. 39 వ బూత్ కమిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా అంకం దుబ్బరాజం, సోషల్ మీడియా ఇన్చార్జిగా గోనె మధుసూదన్ నేత, మహిళా విభాగం ఇన్చార్జిగా దుద్దెడ అరుణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్, 18 వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు తుమ్మ భానుచందర్, సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి, మహిళా అధ్యక్షురాలు రేపాక పుష్పాంజలి ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను పట్టించుకోరా?

- సమయానికి అందని చాలీచాలని వేతనాలు
- సబ్బులు, గ్లౌస్‌లు, షూ, మాస్కుల కొరత
- గుర్తింపుకు నోచుకోని పారిశుధ్య కార్మికులు

నవతెలంగాణ-వర్గల్

వర్గల్ మండలంలోని 27 గ్రామాలలో స్త్రీలు, పురుషులు కలిసి 190 మంది పారిశుధ్య కార్మికులు సేవలు అందిస్తున్నారు. వీరికి ప్రస్తుతం సమయానికి జీతాలు అందడం లేదు. వీరికి సరిపడా రక్షణ పరికరాలు కూడా అందుబాటులో లేవు. పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె, గ్లౌస్‌లు, మాస్కులు, హెల్మెట్లు అందుబాటులో లేవు. పారిశుధ్య కార్మికులకు ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల సరైన సౌకర్యాలు లేవు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్మికులు రోజూ ఉదయం చెత్త సేకరణ చేస్తారు. నీటి సరఫరా పనులను చూస్తున్నారు. చెత్త సేకరణ సమయంలో చేతులకు గ్లౌస్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడంలో వారుకి సరైన షూ లేకున్నా అలాగే దిగి పనిచేస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పడుతూ పనిచేస్తున్న వారికి సమయానికి వేతనాలు రావడం లేదు. పారిశుధ్య కార్మికులకు ప్రస్తుతం రూ.8,500 వేతనం వస్తున్నది. కొన్ని గ్రామాల్లో తక్కువగా వేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఒక్కరి జీతంతో ఇద్దరు పనిచేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలు దృష్ట్యా రూ.8,500 రూపాయలు సరిపోవడం లేదు. రూ.20 వేల వేతనం వచ్చేలా చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం అందరికీ పీఆర్సీ పెంచినప్పటికి అది వీరికి వర్తించడం లేదు. పారిశుధ్య కార్మికులకు ప్రతి రెండు నెలలకోసారి హెల్త్ చెకప్ చేయించాల్సి ఉండగా అడిగే నాథుడే కరువయ్యాడు. 2010 జనాభా లెక్కల ప్రకారం 500 మంది జనాభాకు ఒక పారిశుధ్య కార్మికుడు ఉండాలి. ప్రస్తుతం జనాభా పెరిగినప్పటికి అరకొరగా కార్మికులు ఉన్నారు. ఉన్న కార్మికులు రకరకాల పనులతో పని వత్తిడి ఏర్పడుతోంది. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్మికులే నీళ్ల సరఫరా చేయడం, వీధిదీపాలు వేయడం వంటి పనులు చేస్తున్నారు. తక్కువ మంది కార్మికులు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య కార్మికుల్లో 90 శాతం మంది దళితులు, పేదలే ఉన్నారు. తాము ఎదుర్కొంటున్న కష్టాలను పట్టించుకునే వారేలేరని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ఎప్పటికైనా తమ కష్టాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.





వాళ్లు లేకపోతే రోజు గడవదు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పని చేశారు. అయినా వారికి సరైన గుర్తింపు లేదు. రోడ్లు, వీధులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులు అక్కడ ఉండాల్సిందే. అలాంటి పారిశుధ్య కార్మికులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

వేతనాలు పెంచాలి



పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న వేతనాలను పెంచాలి. ప్రభుత్వం ఇస్తున్న పీఆర్సీ మాకు వర్తించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి నెలా వేతనాలు సమయానికి వచ్చేలా చూడాలి. ఐడీ కార్డు, ఇన్సూరెన్స్ వంటివి కల్పించాలి. పారిశుధ్య కార్మికుల సమస్యలు తీరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- భిక్షపతి, పారిశుధ్య కార్మికుడు

ఆరోగ్యంతో చేలగటాలాడొద్దు



ప్రతి గ్రామంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు, గ్లౌస్, షూ, మాస్కులు సరిగ్గా ఇవ్వడం లేదు. వారికి రెండు నెలలకోసారి చేయించాల్సి హెల్త్ చెకప్స్‌పై నిర్లక్ష్యంగా ఉంటున్నారు. కార్మికులపై పని వత్తిడి తగ్గించి, వారికి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

- సదబోయిన ఎల్లయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు

సోలిపేటకు జన్మదిన శుభాకాంక్షలు





నవ తెలంగాణ-దుబ్బాక

దివంగత దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి తనయుడు సతీష్‌రెడ్డి 35వ జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం సిద్దిపేటలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ చిట్టాపూర్ మాజీ గ్రామాధ్యక్షుడు పెంటి కిషన్ నేత ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని రాజకీయాల్లో తనకంటూ ఓ గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం సతీష్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు.

నవ తెలంగాణ-దౌల్తాబాద్

దుబ్బాక దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి తనయుడు సోలిపేట సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో దౌల్తాబాద్ బీఆర్ఎస్ నాయకులు సిద్దిపేటలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని వారు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్, గొడుగుపల్లి సర్పంచ్ పట్నం శెట్టి శివకుమార్, పీటర్ ,స్వామి, పంజా ప్రశాంత్, ఆంజనేయులు, రాజు, కరుణాకర్, ఖలీల్, నాగరాజు, మల్లేశం, కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలి



నవ తెలంగాణ-సిద్దిపేట

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులన్నిటికీ ఖర్చులను ఆధారంగా చేసుకుని లాభసాటి ధర చెల్లించాలని భారతీయ కిసాన్ సంగ్ జాతీయ కార్యదర్శి సాయి రెడ్డి, అఖిలభారత కార్యవర్గ సభ్యులు, తెలంగాణ ప్రభరి నాన ఆత్రేయ ప్రభుత్వాన్ని కోరారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశము పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ లో రాష్ట్ర అధ్యక్షులు జోగినపల్లి రంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సమస్యలపై చర్చించడానికి ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి, రైతు సమస్యలను పరిష్కరించాలని, ధరణి సమస్యలపై వెంటనే స్పందించి, తగు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 20 గంటల ఉచిత నాణ్యమైన కరెంటును ఇవ్వాలని, పంటలకు బీమా పరిహారం అందేలాగా చూడాలని కోరారు. నవంబర్ 13న రైతు మహాగర్జన, డిసెంబర్ 19న ఢిల్లీలో జరిగిన రైతు ర్యాలీ పై చర్చించడం జరిగిందనీ తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోసం మార్చిలో వారం రోజులపాటు కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగం రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, దోమురి రాము, మాదిరెడ్డి రాజి రెడ్డి, పన్యాల వెంకట్ రెడ్డి, బోరం పేట మల్లారెడ్డి, సురేందర్ రెడ్డి, నాయిని ఎల్లా రెడ్డి, శ్రీనివాస్, భూమారెడ్డి, కూరెల్ల జశ్వంత్ రెడ్డి , పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, వేజు గోపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌కు పోటెత్తిన భక్తజనం

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- మల్లన్న నామస్మరణంతో మార్మోగిన ఆలయం

నవ తెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి మల్లన్న కోటొక్క దండాలు, సత్తేటి వారాలా మల్లన్న నీకు లక్షొక్క దండాలు కోరమీసాల మల్లన్న నీకు కోటొక్క దండాలు అంటూ భక్తులు శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రెండో ఆదివారాని(లష్కర్వారం)కి భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న నామస్మరణం తో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి సంక్రాంతి తర్వాత వచ్చే సత్తేటి వారాలలో రెండో ఆదివారాన్ని లష్కర్ వారంగా భావిస్తారు. దీనికి హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, జిల్లాల నుంచే కాకుండా ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. శనివారం అర్ధరాత్రి నుంచి భారీగా తరలివచ్చి కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్నారు. భక్తులకు దేవస్థానానికి సంబంధించిన గదులు చాలకపోవడంతో ప్రయివేటు గదులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆలయ ప్రాంగణంలోని గంగరేణు చెట్టు, రాజగోపురం, రాతిగీరలు కోడెల స్థంబం, తోట బావి, ఎల్లమ్మ కమాన్ బస్టాండ్ ప్రాంగణం, సినిమా టాకీస్ ప్రాంగణం, రాంసాగర్ రోడ్డులోని కుర్మసంఘం వరకు, పెద్దమ్మ ఆలయ ప్రాంగణాలు, మల్లన్న చెరువు పార్కింగ్ స్థలం, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఖాళీ స్థలం భక్తుల విడిదితో పూర్తిగా నిండిపోయాయి. ఈసందర్భంగా అడిషనల్ డిసిపి మహేందర్ ఆధ్వర్యంలో 250 మంది ఎస్ సిసి విద్యార్థులు, 180 మంది పోలీసులతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొక్కులు అప్పగించడానికి వచ్చిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. స్నానమాచరించి ఒక్కపొద్దులతో మట్టికుండలలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. ఏడు. ఐదు, మూడు, రెండు ఒక అంత్రాల బోనాలను ఎత్తుకొని శివ సత్తులు సిగమూగుతూ డప్పుచప్పుళ్ళతో స్వామి మొక్కులు చెల్లించారు. అనంతరం గంగరేణు చెట్టువద్ద భోనాలు పెట్టి పట్నాలు వేసి మల్లన్నకు మొక్కులు అప్పగించారు. అనంతరం క్యూలైన్లో వెళ్లి మల్లన్నను దర్శించుకున్నారు. దర్మదర్శనానికి ఐదు గంటల సమయం,రూ100ల శీఘ్ర దర్శనానికి మూడుగంటల సమయం, రూ150 విశిష్ట దర్శనంలో మూడు గంటలు, రూ500 లతో వి.వి.ఐ.పి దర్శనానికిబ గంట సమయం పట్టింది. కొమురవెల్లికి వచ్చిన భక్తులు మొదట మల్లన్నకు బోనాలు, పట్నాలు అప్పగించారు. అనంతరం మల్లన్నగుట్ట (ఇంద్రకీలాద్రి గుట్ట పై వెలసిన రేణుక ఎల్లమ్మకు శివసత్తులు బోనాలు ఎత్తుకుని సుమారు 500 మెట్లు ఎక్కుకుంటూ మొక్కులు చెల్లించారు. రేణుక ఎల్లమ్మతో పాటు నల్లపోచమ్మలను దర్శించుకోవాడానికి మూడు గంటల సమయం పట్టింది కొమురవెల్లిలో మల్లన్నకు మొక్కులు అప్పగించిన తర్వాత గుట్టపై వెలసిన రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

సామాజిక విప్లవానికి దారులు వేసిన మాష్టార్జీ పాట

నవతెలంగాణ-రాయపోల్



అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగునింపిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై మాష్టార్జీ మొదటిసారి పాట రాసి తెలుగు ప్రపంచానికి పరిచయం చేశారని పలువురు వక్తలు గుర్తు చేశారు. 45 సంవత్సరాల విశ్వజన కళా మండలి ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాయపోల్‌లోని గంగధారి రాజయ్య ప్రాంగణంలో ప్రజా రచయిత మాష్టార్జీ ఆధ్వర్యంలో కళా ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. కళాకారుల పాటలు, వక్తల ఉపన్యాసాలు, సన్మాలతో రాత్రి వరకు ఆద్యంతం చైతన్యవంతంగా సాగింది. విశ్వజన కళామండలి 45 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా రాయపోల్ ముద్దుబిడ్డ ఓయూ జేఏసీ చైర్మన్ కళాకారులు దరువు అంజన్నను ఘనంగా సన్మానించారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్‌తోపాటు అంబేద్కర్ ఆశయ సాధన కృషి చేస్తున్న 20 మందిని సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుబ్బాక శాసన సభ్యులు మాదవనేని రఘునందన్ రావు, రాష్ట్ర ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, హైకోర్టు అడ్వకేట్ టి.రాజు, ఎస్సిఆర్పీ సొసైటీ జాతి అధ్యక్షులు నాగేశ్వరరావు, జ్ఞాన ప్రచార సభ వ్యవస్థాపకులు నల్ల బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి హాజరయ్యారు. మాష్టార్జీ చిన్ననాడు రాయపోల్ నుంచి తిమ్మక్‌పల్లికి నడుచుకుంటూ వెళ్లే సందర్భంలో ఎదురైన సంఘటన ఆధారంగా మాష్టారీజ ఎమె ఎల్లి ఎవడె ఇ పొరగాడు అనే పాట సభికులను ఆలోచింపజేసింది. అంబేద్కర్ తదితర మహనీయుల ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు బొగ్గుల చందు, శివ కుమార్, మాస్టర్ జీ ఫౌండేషన్ అధ్యక్షురాలు ప్రమీల, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి, తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్, విశ్వ జన కళ మండలి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు బాల నర్సింహా,బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజీ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్, కళాకారులు శేఖర్, గంగ జమున, అందే భాస్కర్, స్వామి, రజిత, పరశురాములు, ప్రకాష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 17వ వార్డు

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 17వ వార్డులో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారమవుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. ప్రజా ప్రతినిధిగా 20 ఏళ్లకుపైగా అనుభవం ఉన్న 17వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ కిషన్ రెడ్డి గ్రామంలో ఉంటూ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలో విలీనం కాకముందు ముత్రాజ్‌పల్లి సర్పంచిగా గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. 2012లో గజ్వేల్ మున్సిపల్ లో ముత్రాజ్ పల్లిని విలీనం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ గా దుంబాల లక్ష్మి కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. అప్పటినుండి గ్రామంలో ఉంటూ కౌన్సిల్ పరిధిలో వచ్చే అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు మురికి కాలువ నిర్మాణానికి నిధుల ప్రతిపాదించారు. వార్డులో ఎక్కువగా కొత్త కాలనీలు ఏర్పాటు కావడం వల్ల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సమస్యను పరిష్కరిస్తున్నారు. ఇందులో బాగానే ముత్రాజ్ పల్లి గ్రామంలో 4 లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణం చేశారు. ఆఫీసర్స్ కాలనీ నుండి లక్ష్మి ప్రసాద్ నగర్ కు కృష్ణ టెంపుల్ వరకు 18 లక్షల రూపాయలతో మురికి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ముత్రాజ్ పల్లి గ్రామంలో 8 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం వార్డులో అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటు వీధి దీపాల బిగింపు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మున్సిపల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. వార్డులో అంతర్గత మురికి కాలువ నిర్మాణం 95 శాతం పూర్తి చేశారు. ఇంటింటికి కలెక్షన్లు మొత్తం పూర్తి చేశారు. మైనార్టీల స్మశాన వాటిక 15 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆఫీసర్స్ కాలనీలో పార్కు అభివృద్ధి కొరకు 12 లక్షలు మంజూరు చేశారు. ముత్రాజ్ పల్లి గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద నలభై లక్షల రూపాయలతో జంక్షన్ అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆఫీసర్స్ కాలనీలో కోటి రూపాయలతో ఐదు సిసి రోడ్లు నిర్మాణం జరుగుతున్నాయి. ముత్తూట్ ఫైనాన్స్ నుండి చంద్రశేఖర్ రెడ్డి ఇంటి వరకు 25 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణం. కృష్ణ టెంపుల్ వద్ద నుండి రెండు సీసీ రోడ్ల నిర్మాణం 40 లక్షలు నిధులు మంజూరు చేసి పనులు చేస్తున్నారు. పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నుండి వయా లక్ష్మీ ప్రసన్న నగర్ లో షిరిడి సాయిబాబా దేవాలయం ముందు నుండి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వరకు 60 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది.



వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. నిధుల కొరత లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కృషితో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు నిధులు మంజూరు చేస్తున్నారు. గతంలో సర్పంచిగా పనిచేసిన అనుభవంతో అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రతిపాదిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారు. ముత్రాజ్ పల్లి, కృష్ణ టెంపుల్, లక్ష్మీ ప్రసన్న నగర్, ఆఫీసర్స్ కాలనీ తదితర కాలనీలా అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రెండో దశ నిధులు మంజూరు అవుతే పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రజలకు సేవ చేసే భాగ్యం.

- లక్ష్మి కిషన్ రెడ్డి

బాలసాహిత్యం అందరికీ అవసరం

డాక్టర్ వాసరవేణి పర్శరాములు



నవతెలంగాణ-సిద్దిపేట

బాలసాహిత్య రచనలు అందరికీ చేరాలని, అందుకు బాలసాహిత్య కృషి ఎంతో అవసరమని బాలసాహిత్యంలో కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ వాసరవేణి పర్శరాములు అన్నారు. సిద్ధిపేటలో జరిగిన ప్రతి నెల మన బాలసాహిత్యం కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ హారిక చెరుకుపల్లి రచించిన ఆకాశంలో అల్లరి బాలసాహిత్య పుస్తక పరిచయం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల కథలు, గేయాలు బాలల వికాసానికి ఎంతో అవసరమన్నారు. సిద్ధిపేటలో బాలసాహిత్య కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో బాలసాహిత్య రచయితలు ఎన్నవెళ్లి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, బస్వ రాజ్ కుమార్, శ్రీచరణ్ సాయిదాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే రఘునందన్ రావు



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. అభివృద్ధిలో పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని సూచించారు. ఆదివారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ఎమ్మెల్యే రఘునందన్ రావు సుడిగాలి పర్యటన చేశారు. గ్రామంలో సమస్యలు ఏవైనా ఉన్నాయా అని క్షేత్రస్థాయిలో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. మహంకాళి దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా సహకరిస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన చంద్రకళ కుటుంబాన్ని ఎమ్మెల్యే రఘునందన్ రావు పరామర్శించారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న అజిత్ కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే రఘునందన్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటానని ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బిక్షపతి, బాలేష్ గౌడ్, వెంకట్ గౌడ్, కిషన్, నవీన్ పలువురు పాల్గొన్నారు.


చిన్ననాటి స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మద్దూరు

తమ తోటి చదువుకున్న చిన్ననాటి స్నేహితుని భార్య అనారోగ్యంతో ఉండడంతో మద్దూరు మండల కేంద్రంలో పదవ తరగతి 1997-98 సంవత్సరంలో చదువుకున్న చిన్ననాటి స్నేహితులు రూ. 15 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం స్నేహితుని కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కొండూరి రాజు తమ తోటి 1997-98 సంవత్సరం వరకు పదవ తరగతి చదువుకున్నాడు. తమ తోటి స్నేహితుని భార్య అనారోగ్యానికి గురి కావడంతో తోటి స్నేహితులు అందరు కలిసి రూ. 15వేల ఆర్థిక సహాయాన్ని స్నేహితుని కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు

వివాహా వేడుకకు హాజరైన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం గ్రామంలో ఎఎంసీ డైరెక్టర్ తాళ్లపల్లి బీమయ్య కూమారుని వివాహా వేడుకకు అదివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో హజరై వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం రాష్ట్ర ఆహర భద్రత కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ హజరై వధూవరులను ఆశీర్వదించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



నవతెలంగాణ-జగదేవపూర్

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని, గ్రామీణ వికాస్ ప్రాజెక్టు ద్వారా బడులను బాగు చేయడం జరుగుతుందని రోటరి గ్లోబల్ ఛాంపియన్ సంస్థ అధ్యక్షుడు నర్సింహ మేదా అన్నారు. గ్రామీణ వికాస్ ప్రాజెక్టు కింద మండలం పరిధిలోని రాయవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసుకుని పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించారు. ఆదివారం విద్యార్థులకు బెంచీలు, కుర్చీలు, టీవీ, క్రీడా పరికరాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. రోటరి గ్లోబల్ ఛాంపియన్ సంస్థ ఆధ్వర్యంలో బడిని దత్తత తీసుకుని విద్యార్థులకు కావాల్సిన సకల సౌకర్యాలు అందించామని తెలిపారు. పాఠశాలకు రంగులతో అందంగా తీర్చిదిద్దామని, సాంకేతిక విద్య కోసం టీవి అందించామని తెలిపారు. బడి ఆహ్లాదకరంగా ఉన్నప్పుడే విద్యార్థులు చక్కగా చదువుకుంటారని స్పష్టం చేశారు. గ్రామంలో ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు పంపకుండా మన ఊరు మన బడి అనే విధంగా ప్రభుత్వ పాఠశాలకే పంపించి ఆదర్శంగా నిలవాలని కోరారు. సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. అనంతరం జగదేవపూర్ ఎస్ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ రోటరి గ్లోబల్ ఛాంపియన్ సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులకు చదువే పెట్టుబడి చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పావని కనకరాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంఈఓ ఉదయ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహబూబ్ పాషా, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్ కిరణ్, ఉపాధ్యాయులు కృష్ణ, పోచయ్య, మాజీ సర్పంచ్ గణేష్, చంద్రం, శ్రీశైలం, రాజు, గౌస్, శేఖర్, క్లబ్ సభ్యులు మహిపాల్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సోమశాస్త్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కాకుండా బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో ఎస్సీ వీధులలో సీసీ రోడ్లు, గౌడ సంఘం కమ్యూనిటీ హాల్, బైరాన్ పల్లి గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లకు మద్దూరు ఎంపీపీ బద్దిపడగా కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి రావల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులవృత్తులను సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారన్నారు. గొల్ల కురుమలకు గొర్రెలు మత్స్యకారులకు చెరువుల పూడికలు తీసి చేప పిల్లలను సబ్సిడీపై ఇస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడుతుందని ఆయన తెలిపారు. అందులో భాగంగానే తోర్నాల గ్రామంలో ఎస్సీ విధులలో 10 లక్షల నిధులతో సీసీ రోడ్లు గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, బైరాన్ పల్లి ముదిరాజ్ భవన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు చొప్పరి వరలక్ష్మి సాగర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, సర్పంచులు తాళ్లపల్లి రాజమ్మ, బండి శ్రీనివాస్ గౌడ్, ఎంపిటిసి నందన బోయిన నర్సింలు, టీఆర్ఎస్ యూత్ మాజీ అధ్యక్షులు ఇమ్మడి సంజీవరెడ్డి, బైరాన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి పురుషోత్తం, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీ



హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సోషల్ మీడియాలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై వస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ శుభం గార్డెన్‌లో హుస్నాబాద్ నియోజకవర్గం సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉండి అభివృద్ధి చేయని, కేంద్రంలో అధికారంలో ఉండి అభివృద్ధి చేయలేని నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేయడమే కేసీఆర్ లక్ష్యమన్నారు. హుస్నాబాద్ ప్రాంతం సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎంపీపీ లకవత్ మానస సుభాష్, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మీ బిల్లు నాయక్, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ చైర్మన్ రజిని తిరుపతి రెడ్డి, టీఆర్ఎస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు అన్వర్, అక్కన్నపేట టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి సతీష్ అన్న సైన్యం



హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ శుభంగార్డెన్‌లో ఆదివారం చేపట్టిన హుస్నాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా సమావేశానికి సతీష్ అన్న అభిమాన సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి సతీష్ అన్న అభిమాన సంఘం ముందుంటుందని సంఘం అధ్యక్షులు మార్క అనిల్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ అన్న అభిమాన సంఘం నాయకులు గడ్డం సదానందం, పచ్చిమట్ల శ్రీకాంత్, పచ్చిమట్ల జగదీష్, ఇంతియాజ్, బత్తుల రాజు, నరేష్, నాగరాజు, సురేందర్, మల్లయ్య, శ్రీనివాస్, చిన్న శివ నవీన్ రెడ్డి, రంగు తిరుపతి శ్రీధర్ పాల్గొన్నారు.

మిమిక్రీ, మేజిక్ కళాకారులు వై.రమేష్‌కు కీర్తి కళా రత్న పురస్కారం



నవతెలంగాణ-సిద్దిపేట

యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వామి వివేకనంద, నేతాజి సుభాష్ చంద్ర బోస్ జయంతి ఉత్సవాలు 2023, జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ సందర్భంగా సిద్ధిపేటకు చెందిన ప్రముఖ మిమిక్రీ, మేజిక్ కళాకారులు వై.రమేష్‌కు కీర్తి కళా రత్న జాతీయ పురస్కారం అందించారని సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పోలోజు రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మిమిక్రీ కళా రంగంలో కిర్తి కళా రత్న అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు సహకరించిన మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ గ్రామ సేవకుడిగా లక్ష్మణ్‌కు అవార్డు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికునిగా పనిచేస్తున్న బోనగిరి లక్ష్మణ్‌కు జాతీయ ఉత్తమ సేవ అవార్డు యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ అందించింది. స్వామి వివేకానంద , నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి జాతీయ పురస్కారాలు అందించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుట్ల రాజమల్లయ్య, కానుగుల మోహన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మతసామరస్యనానికి పుట్టినిల్లు భారతదేశం

టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

మతసామరస్యనానికి పుట్టినిల్లు భారతదేశం అని టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలం పరిదిలోని చిన్న కిస్టాపూర్ గ్రామంలోనీ మస్జిద్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ సమగ్రత, సామరస్యం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కనకయ్య, పిఏసీఎస్ ఛైర్మెన్ ఇంద్రసేనరెడ్డి , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ రాజు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాజా విరాసత అలి, మజీద్ కమిటీ సదర్ సలీం, సత్తార్, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, జిలానీ, చాంద్ పాషా, రసూల్, ఖాజా, తదితులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-దుబ్బాక రూరల్ : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం టేఎఫ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వార్షికోత్సవం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టేఎఫ్ 2023-25 నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా తీఎ రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎండి జహీరుద్దీన్ ప్రధాన కార్యదర్శిగా పి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఆర్ శ్రీనివాస్ రెడ్డి, పీఆర్ఓగా కనకరాజు ఏకగ్రీవమయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు జహిరుద్దీన్ మాట్లాడుతూ తమ నమ్మకంతో ఈ పదవులు కేటాయించడం చాలా సంతోషకరమన్నారు. కమిటీ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తామన్నారు.